



రమణక్కపేటలో మహిళను పలకరిస్తున్న మాజీ సీఎం జగన్

షోదార్పు యాత్ర..

- వరద బాధిత ప్రాంతాల్లో జగన్ మొక్కుబడి పర్యటన
- పేరుకు బాధితుల పరామర్శ అయినా ఎక్కడా పెద్దగా బురదలో దిగని వైనం
- అసలు ముంపు గ్రామాల్లో పర్యటించకుండానే పైపై పలకరింపులతో సరి
- రమణక్కపేటలో వరద నీటిలో నడవలేక ట్రాక్టరు ఎక్కిన జగన్

- 7లో

కడగండ్లు!



వరదలకు ఏలేరు కాలువల గట్లు చిన్నాభిన్నమయ్యాయి. ఎక్కడికక్కడ గండ్లు పడ్డాయి. పలుచోట్ల గట్లు కోతకు గురయ్యాయి. పంటపొలాల్లో భారీగా ఇసుక మేటలు వేశాయి. గట్లు బలహీనంగా మారడం, గండ్లు నుంచి ఇంకా వరద నీరు ప్రవహిస్తుండడంతో రైతులు కలవరానికి గురవుతున్నారు.



గండ్లు కారణంగా పిఠాపురం-రాపర్తి రోడ్డులోని పంటపొలాల్లో వేసిన ఇసుక మేటలు.. (పక్కన) గొల్లప్రోలు సమీపంలో ఏలేరు కాలువకు పడిన గండ్లు

- భారీ వరదలతో ఏలేరు కాలువలకు 25కిపైగా గండ్లు
- సుమారు 30కిపైగా ప్రాంతాల్లో కోతకు గురైన గట్లు
- పలుచోట్ల బలహీనంగా మారడంతో రైతుల్లో కలవరం

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 13: ఏలేరుకు సంభవించిన భారీ వరదలతో పంటకాలువలు ఛిద్రమయ్యాయి. రిజర్వాయర్ నుంచి ఒక్కసారిగా భారీగా మిగులు జలాలు విడుదల చేయడంతో ఏలేరు కాలువలకు ఎక్కడికక్కడ గండ్లు పడ్డాయి. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల పరిధిలోని 25 ప్రాంతాల్లో గండ్లు పడగా, ఇందులో రాపర్తి సమీపంలోని గొర్రిఖండి వంటి ప్రాంతాల్లో 100 మీటర్ల వెడల్పున గండిపడడం వరదల తీవ్రతకు అద్దంపడుతోంది. వరద ఉధృతితో గొర్రిఖండి, నక్కలఖండి, పిప్పికాలువ, గొల్లప్రోలు కాలువ, పిడిందొడ్డి, ఎదురొడ్డి, బాడవ, పులిదొడ్డి, తుపాకిగడ్డ సహా పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఏలేరు నీరు ప్రవహించే కాలువలకు 25గండ్లు పడ్డాయి. ఇందులో పదికి పైగా గండ్లు అతి భారీగా ఉన్నట్టు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఇప్పుడు కూడా ఈ గండ్ల నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. మరోవైపు పలుచోట్ల ఏలేరు, అనుబంధ కాలువల గట్లు కోతకు గురయ్యాయి. ఇప్పటికి మట్టి అండలుగా జారిపోతోంది. కొన్నిచోట్ల గట్లు కుంగిపోయాయి. ఏలేరుకు మళ్లీ వరద జలాలు విడుదలచేస్తే ఇవి పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటపొలాల్లో ఇసుక మేటలు

ఏలేరు వరదల వల్ల పంటపొలాల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి. గండ్లు పడిన ప్రాంతాలతోపాటు వరదనీరు గట్లు మీద నుంచి ప్రవహించిన ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. పిఠాపురం, గొల్లప్రోలు, రాపర్తి, సీతానగరం, లక్ష్మీపురం, మల్లవరం, భోగాపురం, బి.ప్రత్తిపాడు తదితర ప్రాంతాల్లో సుమారు 120 ఎకరాల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి. వీటిని తొలగించేందుకు ఎకరానికి రూ.25 నుంచి రూ.40 వేల వరకూ వ్యయం అవుతుందని రైతులు చెబుతున్నారు. ఇక ఏలేరు వరదలతో వరి తదితర పంటలను రైతులు పూర్తిగా కోల్పోయారు. దీంతో మళ్లీ వరి సాగు చేయాలంటే నాట్లు వేయాలి. అయితే గండ్లు పూడ్చకుంటే పంట మళ్లీ సాగు చేసినా ఉపయోగం ఉండదని రైతులు చెబుతున్నారు. యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చాలని రైతులు కోరుతున్నారు. అయితే అక్కడకు ఇసుకబస్తాలు, గండ్లు పూడ్చేందుకు అవసరమయి సామగ్రిని తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు ఉన్నాయి. ఈనేపథ్యంలో గండ్లు పూడ్చాలంటే సమయం పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో తిరిగి పంటల సాగుపై రైతులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు గండ్లుపడిన ప్రాంతాలను సందర్శించి అక్కడ రింగ్‌బండ్‌ల నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షిస్తున్నారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌తోపాటు ఉన్నతాధికారులు పరిశీలన జరిపారు. గండ్లను తాత్కాలికంగా పూడ్చి వ్యవసాయ సీజన్ ముగిసిన వెంటనే పూర్తి స్థాయిలో పూడ్చడమే ప్రస్తుతానికి మెరుగైన ఆలోచనగా వారు భావిస్తున్నారు.





గొల్లప్రోలు-పిఠాపురం పట్టణాల మధ్య కుళ్లిపోయిన వరి చేను.. గొల్లప్రోలు బల్లకట్టు వద్ద ఉధృతంగా ఉన్న ఏలేరు కాలువ

కుళ్లిపోతున్న వరి పంట

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 13: ఏలేరు వరదల కారణంగా పంటపొలాల్లో ముంపు ఇంకా పూర్తిగా తగ్గుముఖం పట్టలేదు. పిఠాపురం బైపాస్‌రోడ్డు, గొల్లప్రోలు బైపాస్ రోడ్డుతోపాటు రెండు పట్టణాల మధ్య, రాపర్తి, గోకివాడ, భోగాపురం, బి.ప్రత్తిపాడు, ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, సీతానగరం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో సుమారు 4,500 ఎకరాల్లో ఇంకా ముంపు కొనసాగుతోంది. ఇప్పటికే ముంపునకు గురైన వరి పంట పూర్తిగా కుళ్లిపోయింది. అక్కడక్కడ పంట కనిపిస్తున్నా సాగుకు పనికి రాదని రైతులు చెబుతున్నారు. ముంపు పూర్తిగా తగ్గేందుకు మరో రెండు రోజులు సమయం పట్టే పరిస్థితి కనిపిస్తోంది. ఎకరానికి రూ.18 వేల నుంచి రూ.27 వేల వరకూ పెట్టుబడులు పెట్టామని, దానిని పూర్తిగా కోల్పోయామని రైతులు తెలిపారు. మళ్లీ పంట సాగు చేసేందుకు తమ వద్ద పెట్టుబడులు లేవని వారు చెప్పారు. నూరు శాతం సబ్సిడీపై వరి నారు అందించాలని వారు కోరుతున్నారు.

మళ్లీ ఉధృతంగా ఏలేరు కాలువలు

గొల్లప్రోలు/ఏలేశ్వరం, సెప్టెంబరు 13: ఏలేరు కాలువలు మళ్లీ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రిజర్వాయర్ నుంచి శుక్రవారం మిగులు జలాల విడుదలను గణనీయంగా పెంచారు. ఉదయం 9 గంటలు నుంచి ఏలేరు కాలువలకు 4,875 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయడంతో గొల్లప్రోలు, పిఠాపురంల్లో గల ఏలేరు కాలువలన్నీ నిండుగా ప్రవహిస్తుండడంతో రైతుల్లో కలవరం మొదలైంది. నీటి విడుదల ఆరు వేల క్యూసెక్కులకు చేరితే మళ్లీ పొలాలన్నీ ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. అదే సమయంలో ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న ముంపు కొనసాగుతోంది. గండ్ల ద్వారా నీరు ప్రవహించి మళ్లీ పొలాలను ముంచెత్తుతోందని రైతులు చెబుతున్నారు. ఇదే జరిగితే అక్కడక్కడ మిగిలిన 10-20 శాతం పంటను కూడా కోల్పోతామని వారు ఆవేదన చెందుతున్నారు. ఇక ఏలేరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి 4875 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, 22.56 టీఎంసీలు ప్రాజెక్టులో ఉంది.

30 వేల హెక్టార్లలో పంటలకు నష్టం

ప్రభుత్వానికి మరో నివేదిక

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు13: ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదల వల్ల వ్యవసాయ పంటలకు భారీ నష్టం జరిగింది. తాజాగా మరొక నివేదికను ప్రభుత్వానికి జిల్లా అధికారులు పంపారు. దీనిలో జిల్లాలో 30 వేల హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం జరిగినట్టు గుర్తించారు. దీనిలో వరి, పత్తి, మినుము, మొక్కజొన్న పంటలున్నాయి. దీనివల్ల 41,796 మంది రైతులు నష్టపోగా, 76,203 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి తగ్గుతుందని అంచనా వేశారు. దీని విలువ రూ.178 కోట్ల 89 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. దీనికి ఇన్‌పుట్ సబ్సిడీ కావాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిలో అత్యధికంగా వరిపంటకు నష్టం జరిగినట్టు గుర్తించారు. అలాగే 75 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం జరిగింది. దీనివల్ల 125 మంది రైతులకు చెందిన కూరగాయలు, అరటి, పూలమొక్కలు, బొప్పాయి పంటలు ధ్వంసమయ్యాయి. అలాగే 90 విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్టు నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలో 188 హెక్టార్లలో చేపల చెరువులు ముంపులో ఉన్నట్టు ఆ నివేదికలో పొందుపర్చారు. 11,500 కోళ్ల మృత్యువాత పడినట్టు నివేదించారు. జిల్లాలో 15 మండలాల్లోని 62 గ్రామాలు ముంపునకు గురికాగా, నాలుగు పట్టణాలు ఎఫెక్ట్ అయినట్టు పేర్కొన్నారు. మొత్తంగా 61592 ప్రజలు ముంపుకు గురైనట్టు నివేదికలో వెల్లడించారు. వరదల వల్ల ఇద్దరు మృతి చెందినట్టు నివేదించారు.

తొలిరోజు పంట నష్టం నమోదు

జిల్లాలోని 13 మండలాల్లో శుక్రవారం తొలిరోజు పంటనష్టం నమోదు ప్రక్రియ పూర్తిచేశారు. ముంపులో ఉన్న 16,500 ఎకరాలకు చెందిన రైతుల వివరాలు యాప్‌లో నమోదుచేశారు. అలాగే దెబ్బతిన్న 6700 గృహాల వివరాలను యాప్‌లో నింపారు. శనివారం, ఆదివారం పంట నష్టం నమోదు ప్రక్రియ జరుగుతుందని, సోమవారం సాయంత్రానికి నమోదు క్రతువు పూర్తి అవుతుందని అధికారులు చెబుతున్నారు.



నాగులాపల్లిలో వరద నీటిలో మగ్గుతున్న వరిచేలు

ముంపులోనే చేలు

కొత్తపల్లి, సెప్టెంబరు13: ఏలేరు వరద ముంపు నుంచి కొత్తపల్లి మండలం కోలుకోకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, యండపల్లి, కొండెవరం, వాకతిప్ప, కొత్తపల్లి, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో సుమారు అరు వేల ఎకరాల్లో పంట వరద నీటిలో మునిగింది. మూడు రోజులైనప్పటికీ వరదనీరు తగ్గకపోవడంతో చేలన్నీ కుళ్లిపోతున్నాయని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వరద ముంపు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతాంగం కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

అవగాహన లేకుండా అవాస్తవాలు మాట్లాడతావా..

- వరద ప్రాంతాల్లో జగన్‌ది మొక్కుబడి పర్యటన
- జగనన్న కాలనీలో పర్యటించే ధైర్యం లేదా
- జగన్‌పై పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ ఫైర్

పిఠాపురం, సెప్టెంబరు 13: వరద ప్రాంతాల్లో మాజీ సీఎం జగన్‌ది మొక్కుబడి పర్యటన అని, అసలు నష్టం జరిగిన ప్రాంతాలకు వెళ్లకుండా తూతూమంత్రం పరామర్శలు చేస్తున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఎద్దేవా చేశారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశంలో వరద ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా జగన్ చేసిన వాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గొల్లప్రోలులో మీ హయాంలో ఇచ్చి ప్రస్తుతం ముంపునకు గురైన జగనన్న కాలనీలో పర్యటించే ధైర్యం జగన్‌కు లేకపోయిందన్నారు. అక్కడ బాధితులు నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుసుకుని పర్యటను ఇతర ప్రాంతాల్లో పెట్టుకున్నారని విమర్శించారు. 2009లో రాజశేఖరరెడ్డి ఏలేరు ఆదునికీకరణకు శిలాఫలకం వేసి వదిలివేస్తే టీడీపీ ఏలేరు ఆధునికీకరణను ప్రారంభించి 70శాతం పనులు పూర్తిచేసిందన్నారు. ఏలేరు ఫేజ్-2 కింద ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు రూ.168 కోట్లు వెచ్చించి పనులు ప్రారంబిస్తే దాన్ని ఎందుకు రద్దుచేశారని ప్రశ్నించారు. అయిదేళ్ల కాలంలో ఒక్కశాతం పని కూడా చేయకుండా ఇప్పుడు ఇక్కడకు వచ్చి కల్లిబొల్లి కబుర్లు చెబుతున్నారంటూ జగన్‌పై మండిపడ్డారు. ఏలేరు ఆధునికీకరణ రెండు విడతలకు నిధులు ఇస్తామని రెండేళ్ల కిందట జగన్ గొల్లప్రోలులో ప్రకటించి ఎందుకు నిధులు ఇవ్వలేకపోయారని నిలదీశారు. వరద ప్రాంతాల్లో అసలైన బాధితుల వద్దకు వెళ్లకుండా రోడ్డు మీద పరామర్శలు ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ నాయకులు పిల్లి చిన్నా, సకుమళ్ల గంగాధరరావు, మడికి సన్యాసిరావు, బర్ల అప్పారావు, గాది రాజబాబు, మల్లిపూడి వీరబాబు, సూరవరపుసుబ్బారావు, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి అవాస్తవాలు మాట్లాడుతున్నారు : మర్రెడ్డి

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 13: వరద ప్రాంతాల్లో పర్యటనలో మాజీ సీఎం జగన్‌రెడ్డి అన్నీ అవాస్తవాలే మాట్లాడారని పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు విమర్శించారు. పిఠాపురం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబుతో కలిసి శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రివర్స్ టెండరింగ్ పేరుతో ఏలేరు ఆధునికీకరణ పనులు రద్దుచేసి నేడు భారీ వరదలు, ముంపునకు జగన్ కారణమయ్యారని తెలిపారు. ఏలేరు వరదలపై జగన్ అవగాహన లేకుండా మాట్లాడారని ఎద్దేవా చేశారు. గొల్లప్రోలులో పల్లపు ప్రాంతాల్లో ఇళ్లస్థలాలు ఇచ్చి జగనన్న కాలనీ వాసుల కష్టాలకు కారణమయ్యారని గుర్తు చేశారు. అటువంటి ప్రాంతాల్లో ఎందుకు పర్యటించలేదని ప్రశ్నించారు. సమావేశంలో జనసేన నాయకులు సూరవరపు సురేష్, పిల్లా శివశంకర్, చెల్లుబోయిన సతీష్, జోగా వెంకటరమణ, దానం లాజర్‌బాబు, మార్నీడి రంగా పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న జేసీ రాహుల్‌మీనా



జిల్లా స్థాయి యువజనోత్సవాలలో జానపద గీతం ఆలపిస్తున్న దృశ్యం

జోరుగా.. హుషారుగా..

- ఉత్సాహంగా యువజనోత్సవాలు
- ఉమ్మడి జిల్లా నుంచి 641 మంది హాజరు
- ఫోక్ డ్యాన్స్‌లు-జానపద నృత్యాలు
- ఆకట్టుకున్న సామాజిక జానపద గేయాలు

పోర్టుసిటీ (కాకినాడ), సెప్టెంబరు 13: ఫోక్ డ్యాన్స్‌లు, జానపద నృత్యాలు, సామాజిక జానపద గేయాలతోపాటు పాటల పోటీలు, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు.. ఇలా ఒకే వేదికపై అలరించాయి. జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలకు విశేష స్పందన లభించింది. శుక్రవారం స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్యశావాహిని ఆడిటోరియం యువత కేరింతలతో దద్దరిల్లింది. సామాజిక జానపద గేయాలు ఎంతో ఆకర్షించాయి. నాన్నా.. నాన్నా.. నీ మనస్సెంతో వెన్నలాంటి పాటలు మనసును హత్తుకున్నాయి. మామా.. అత్త ఒప్పుకుంటే.. నిన్నే పెళ్లాడతా వంటి జానపద గేయాలకు విద్యార్థులు పోటీపడి నృత్య అభినయం చేశారు. సోలో డ్యాన్స్‌లు సైతం ఆకట్టుకున్నాయి. సభికుల ప్రశంసలు పొందాయి.

ప్రత్యేక ఆకర్షణగా వైజ్ఞానిక ప్రదర్శన

యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటిలో ప్రధానంగా సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఇల్లు, పుట్టగొడుగుల తయారీ, భూమిలో మట్టి సాంద్రత పెంచేందుకు మొక్కలు పెంపకం, వర్షపునీరు పొదుపు, మట్టి లేకుండా అర్బన్ ప్రాంతాల్లో మొక్కలు పెంపకం తదితర ప్రదర్శనలు ఉన్నాయి. అదేవిధంగా మహిళా రక్షణ పరికరం, ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ ఆన్ ఆఫ్ పరికరం, పర్యావరణం-పచ్చదనం పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

సామాజిక దృక్పథం ఉండాలి : జేసీ

యువత సామాజిక దృక్పథం కలిగి ఉండాలని జేసీ రాహుల్‌మీనా విజ్ఞప్తి చేశారు. స్వామి వివేకానంద 163వ జయంతి పురస్కరించుకుని జరిగిన యువజనోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసీ తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా స్థాయి యువజనోత్సవాలను ప్రారంభించారు. అయన మాట్లాడుతూ యువత విద్యార్థి దశ నుంచే లక్ష్యం ఏర్పరచుకుని దానిని సాధించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. సెట్రాజ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థినులు ఏర్పాటుచేసిన ఓ ప్రదర్శన

ఈనెల 17వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినం : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు, 13: ఈనెల 17వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణదినం సందర్భంగా 19ఏళ్లలోపు పిల్లలు అందరూ ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేసుకునేలా అన్నిశాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా ముమ్మర పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాల్‌లో రాష్ట్రీయ బాల స్వాస్థ్యా కార్యక్రమం కింద ఈనెల 17వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణదినం నిర్వహణ కార్యాచరణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికలలో రక్తహీనతకు ప్రధానంగా జీర్ణవ్యవస్థలో చేరిన నులిపురుగులు కారణమౌతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు ఏటా జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని ఉద్యమ స్థాయిలో నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లాలో 1986 అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని యాజమాన్యాల కింద గల 1864 పాఠశాలలు, 125 జూనియర్ కళాశాలలు, 55 డిగ్రీ కళాశాలలు, 39 సాంకేతిక విద్యాసంస్థలతోపాటు బడిలో నమోదుకాని బాలలు, వెరసీ 1 నుంచి 19 వయస్సు కలిగిన 4,73,859 మంది బాలబాలికలందరికీ నిర్దేశిత మోతాదు విధానం ప్రకారం ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ వార్డెన్లను కోరారు. అవసరమైన మాత్రల నిల్వలను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోల ద్వారా తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థలకు సరఫరా చేయాలని వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో రమేష్, ఎంహెచ్‌వో పృధ్వీరాజ్, జీజీహెచ్ ఆర్ఎంవో అనిత, ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు హైస్కూల్ వద్ద బాలిక కుటుంబీకులు రోదనలు.. ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈవో

బావిలో పడి మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

హైస్కూల్ వద్ద ఆందోళనకారులు నిరసన.. డీఈవో విచారణ

తరలివచ్చిన పెద్దాపురం డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది

ప్రత్తిపాడు, సెప్టెంబరు 13: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని బత్తిన దుర్గాభవాని కుటుంబానికి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తూ మృతురాలు కుటుంబీకులు, బంధువులు, మద్దతుదారులు శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద తీవ్ర ఆందోళన నిర్వహించారు. బాలిక దుర్గాభవాని మృతదేహాన్ని ఆసుపత్రి వద్దే ఉంచి ఈ నిరసన ఆందోళన నిర్వహించారు. మృతి చెందిన బాలిక మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు హైస్కూల్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు సీఐలు క్రాంతికుమార్, లక్ష్మణ్, బి.సూర్యఅప్పారావు, ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, రఘు, జి.సతీష్, పోలీస్ సిబ్బంది హైస్కూల్ వద్దకు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ హైస్కూల్‌కు తరలివచ్చి బాలిక 9వ తరగతి విద్యార్థిని దుర్గాభవాని మృతికి దారితీసిన పరిస్థితులపై విచారణ చేపట్టారు. ఈ విచారణలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎంఈవో పి.రాజబాబు, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఆందోళనకారులు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అంతవరకు కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో డీఎస్పీ లతాకుమారి చర్చలు జరిపి బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలపడంతో ఆందోళనకారులు ఆందోళనను విరమించారు. అనంతరం బాలిక మృతదేహాన్ని తరలించారు.

ప్రావీణ్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి రామ్మోహన్‌రావు

రాజానగరం, సెప్టెంబరు 13 : జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే విద్యలో ప్రావీణ్యం కనబర్చాలని ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జ్ చైర్మన్ ఆచార్య రామ్మోహన్‌రావు యువ ఇంజనీర్లకు సూచించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో మేధ సాంకేతిక ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆచార్య రామ్మోహనరావు, ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు)తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుతం విజ్ఞాన సముపార్జనకు పెద్దగా శ్రమించాల్సిన అవసరంలేదని, అవకాశాలకు కొదవలేదని అందు బాటులో ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకుంటే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. యుక్త వయస్సులో సాధారణంగా వచ్చే భావోద్వేగాలను నియంత్రించుకోగలిగితే విజయం సాధించడం సుసాధ్యమవు తుందన్నారు. మానవతా విలువలను విస్మరించకుండా, జన్మనిచ్చిన తల్లిదండ్రులు తమ కోసం చేస్తున్న త్యాగాలను మరచిపోవద్దని కోరారు. భారతరత్నం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు మాట్లాడుతూ భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఏటా మేధ సాంకేతిక ఉత్సవాలను రెండు దశాబ్దాలుగా తమ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. యువ ఇంజనీర్లలో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి పదునుపెట్టేందుకు మేధ వంటి సాంకేతిక విద్య ఉత్సవాలు మంచి వేదికలుగా నిలుస్తాయన్నారు. జీజీయూ ఉపకులపతి యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ సంస్కృతీసంప్రదాయాలను విలువలను పాటించడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో వస్త్ర ధారణ విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తొలుత జీజీయూ ప్రాంగణంలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి రామ్మోహనరావు, ఛాన్సలర్ చైతన్యరాజు, చంద్రశేఖర్ తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, కేబీఆర్ వర్మ, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్స్ టి.జయానంద కుమార్, ఎంపీఎస్‌బాబు, పి.జి.రామానుజం, మేధ కన్వీనర్లు బి.సుజాత, ఆర్.తమిళ్‌కోడి, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా

నరేంద్రపురం నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర

28 ఏళ్లుగా వేంకటేశ్వరస్వామి మాలధారణతో తిరుమలకు వెళ్తున్న భక్తులు


సైకిళ్లపై తిరుమలకు బయలుదేరిన యాత్రికులకు జెండా ఊపుతున్న బత్తుల వెంకటలక్ష్మి

రాజానగరం, సెప్టెంబరు 13 : మండలంలోని నరేంద్రపురం గ్రామానికి చెందిన వేంకటేశ్వరస్వామి భక్తులు శుక్రవారం సైకిల్ యాత్ర చేపట్టారు. 28 ఏళ్లుగా ఏటా క్రమం తప్పకుండా వారం దరూ వేంకటేశ్వరస్వామి మాల ధరించి, దీక్ష పూర్తిచేసుకుని సైకిల్‌పై తిరుమలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకోవడం పరిపాటిగా మారింది. గ్రామానికి చెందిన ప్రగడ అంకాలు తన స్నేహితులతో కలిసి చేపడుతోన్న ఈ సైకిల్ యాత్ర 28 వసంతాలు పూర్తి చేసుకుంది. అంతేకాకుండా నరేంద్రపురంతో పాటుగా సీతానగరం, వెలుగుబంద, చెముడులంక గ్రామాల నుంచి 400 నుంచి 500 మంది భక్తులు ఏటా సెప్టెంబరులో సైకిల్ యాత్ర చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. వారం రోజుల పాటు సాగే యాత్ర తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనంతో దీక్ష ముగుస్తుందని భక్తులు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ నా సేన కోసం నావంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి దివాన్‌చెరువు వనువులమ్మ ఆలయం వద్ద ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ వేగిశెట్టి రాజు, నాయకులు యర్రంశెట్టి శ్రీను, చిట్టిప్రోలు సత్తిబాబు, ప్రగడ నాగేశ్వరరావు, గట్టి రాంబాబు, ప్రగడ రాంబాబు, యర్రంశెట్టి తిరుమలేష్, తంగెళ్ల వీరబాబు, వంకా మల్లిబాబు, గంగిశెట్టి రాజేంద్ర తదితరులు పాల్గొని సైకిల్ యాత్ర సజావుగా సాగాలని ఆకాంక్షించారు.

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా పాఠంశెట్టి బాధ్యతలు..


కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ సీఈవో నారాయణ మూర్తి

కాకినాడ సిటీ, సెప్టెంబరు 13: ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లా ప్రజాపరిషత్ ఇన్‌చార్జి ముఖ్యకార్యనిర్వహణాధికారిగా పాఠంశెట్టి నారాయణ మూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ డివిజన్ డీఎల్‌డీవోగా విధులు నిర్వర్తిస్తున్న పాఠంశెట్టికి ఇన్‌చార్జి సీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కార్యాలయంలో సీఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇంతవరకు సీఈవోగా పని చేసిన ఎ.శ్రీరామచంద్రమూర్తి ఎన్నికల నిర్వహణ విధుల్లో భాగంగా కాకినాడ వచ్చారు. తిరిగి మాతృశాఖ రెవెన్యూలో జీఏడీ నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలందాయి. దీంతో సీఈవోగా ఆయన రిలీవ్ అయ్యారు.

షోదార్ప్య యాత్ర..

- వరద బాధిత ప్రాంతాల్లో జగన్ మొక్కుబడి పర్యటన
- పేరుకే బాధితుల పరామర్శ.. ఎక్కడా బురదలో దిగని వైనం
- ముంపు గ్రామాల్లో పర్యటించకుండానే పైపై పలకరింపులతో సరి


నాగులాపల్లి వరద నీటిలో ట్రాక్టర్‌పై బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న మాజీ సీఎం జగన్

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/ పిఠాపురం, సెప్టెంబరు 13 : ఏలేరు వరద బాధిత ప్రాంతాల్లో శుక్రవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచార తరహాలో ప ర్యటించడం విమర్శలకు దారితీసింది. వరద బాధితులకు ధైర్యం చెప్పడం మాటేమోగాని, ఎక్కడా వరద నీటిలోకి దిగకుండా, బాధితుల గోడు ఆలకించకుండా కేవలం నడిరో డ్డుపైనే వారిని నిలబెట్టి కారు ఎక్కి వెళ్లిపోయారు. దీంతో బాధితులు అవాక్కవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఏలేరు వరదలకు నాలుగు నియోజకవర్గాల్లో తొమ్మిది మండలాల్లో 64 గ్రామాలు కకావికలం అయ్యాయి. వేలాదిమంది బాధితులు తీవ్రంగా నష్టపో యారు. ఈ నేపథ్యంలో వీరిని ఇప్పటికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే మాజీ సీఎం జగన్ శుక్రవారం ఏలేరు బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. కానీ ఇది పరామర్శల తరహాలో కాకుండా ప్రచారంలా మారడం విశేషం. తొలుత ఉదయం 10.40 గంటలకు పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో హెలీకాప్టర్‌లో దిగారు. అక్కడి నుంచి చేరుగా పిఠాపురం మండలం మాధాపురం వెళ్లారు. అక్కడ వరద బాధితులు జగన్‌ను చూసి ముంపునకు గురైన తమ గ్రామంలోకి వచ్చి తమ కష్టాలు తెలుసుకోవాలని కోరారు. కానీ జగన్ మాత్రం గ్రామంలోకి వెళ్లడానికి ఇష్టపడ లేదు. దీంతో వారంతా నీర సించారు. కాగా దారిలో చిన్నచిన్న గ్రామాలున్నా వాటిలో ఎక్కడ వరద ప్రభావం లేదు. కానీ జగన్ మాత్రం ప్రతి చోటా ఆగి.. దారిపై ఉన్న వారందరినీ పలకరిస్తూ చేతులు ఊపారు. ముద్దులు పెడుతూ. తల నిమురుతూ ముందుకు సాగారు. దీంతో బాధితుల పర్యటన కంటే వర ద ప్రభావం లేని ప్రాంతాల్లోనే జగన్ ఎక్కువ సేపు గడి పారు. ఆ తర్వాత పాత ఇసుకపల్లిలో ఆగి ప్రజలను పలక రించారు. ఆ తర్వాత జగన్ నాగులాపల్లి ముందు వంతెన కింద ఏలేరు వరదను పరిశీలించారు. ఆ తర్వాత నాగులా పల్లికి చేరుకున్నారు. కొందరు బాధితులు తమ గోడు వినా లని కోరగా, చేతికి ఉన్న వాచీ చూపించి సమయం లేదంటూ వెళ్లిపోయారు. అలాగే రమణక్కపేటకు మధ్యాహ్నం రెండున్నర దాటిన తర్వాత చేరుకున్న జగన్ అక్కడ రహదారిపై వరద ఎక్కువగా ఉందనే కారణంతో ట్రాక్టర్ ఎక్కి గ్రామంలో పరామర్శకు వెళ్లారు. తీరా అదే దారిలో పార్టీ నేతలు, కార్యకర్తలు నడుచుకుని వెళ్లారు. అక్కడ కూడా బాధితులతో మాట్లాడేందుకు పెద్దగా ఆసక్తి చూపని జగన్ వైసీపీ అధికారంలోకి లేకే ఇన్ని కష్టాలు వచ్చాయంటూ బాధితులకు చెప్పడం విశేషం. దీంతో వారంతా అవాక్కయ్యారు.

అందుకే అక్కడికి వెళ్లలేదు..

జగన్ గొల్లప్రోలు మండలంలో పర్యటించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. గొల్లప్రోలు ఏలేరు వర దతో తీవ్రంగా అతలాకుతలమైంది. దీనికి ప్రధాన కారణం ఏలేరు ఆధునీకరణ జరగకపోవడమే. అయితే జగన్ 2022లో గొల్లప్రోలు వచ్చినప్పుడు ఏలేరు ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తానని చెప్పి చేయలేదు. దీంతో పనులు జరగలేదు. దీంతో ఇక్కడకు వస్తే జనం తిరగబడ తారనే భయంతో జగన్ పెద్దగా వరద ప్రభావం లేని ప్రాంతాల్లో పర్యటించి మమ అనిపించారు. మరోపక్క జగన్ జిల్లాకు వచ్చినా మాజీ మంత్రులు వేణు, విశ్వరూప్ గైర్హాజరయ్యారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు కూడా ముఖం చాటేశారు. కాగా జగన్ పర్యటనలో పోలీసులు అతి చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వైసీపీ కార్యకర్తల అత్యుత్సాహం

కొత్తపల్లి, సెప్టెంబరు 13: ఏలేరు వరదల కారణంగా నీట ముంపునకు గురైన కొత్తపల్లి మండలంలో ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి శుక్రవారం పర్యటించారు. జగన్‌కు బాణసంచాతో స్వాగతం పలికేందుకు నాగులా పల్లిలో వైసీపీ కార్యకర్తలు ఉర్రూతలూగారు. జగన్ ఇసుకపల్లి నుంచి నాగులాపల్లికి సమీపించేసరికి యువ కులు ఒకటి రెండు తారాజువ్వలు పేల్చారు. ఇంతలో కొందరు మాజీ సీఎం వరద బాధితులను పరామర్శించే ందుకు వస్తున్న తరుణంలో బాణసంచా కాల్చడం సరి కాదని చెప్పడంతో కాల్చడం విరమించారు. నాగులాపల్లి పాటి మీద నుంచి రమణక్కపేట వెళ్లేందుకు కాలువలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో ట్రాక్టర్‌పై మాజీ సీఎం జగన్, మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, వైసీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి వెళ్లారు. వరద ముంపులో ఉన్న బాధితులకు నేటికీ ఎవరూ సాయం అందించలేదని పలువురు మహిళలు మాజీ సీఎంకు తెలిపారు. వరద బాధితులకు తక్షణం సాయం అందించే విధంగా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని జగన్ బాధితులకు హామీ ఇచ్చారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి



ధవళేశ్వరం, సెప్టెంబరు 13 : రెండు రోజులుగా గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతుంది. ధవళేశ్వరం వద్ద శుక్రవారం ఉదయానికి నీటిమట్టం 13.70అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చ రికను ఉపసంహరించారు.ఆపై క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం సాయంత్రం ఆరు గంటలకు 12.20 అడుగులకు చేరుకుంది. 10,46,957 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి ప్రవహిస్తోంది. అర్ధరాత్రికి మొదటి ప్రమాదహెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటి మట్టం తగ్గవచ్చు. ఎగువన భద్రా చలంవద్ద తగ్గుతున్న నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 39.50 అడుగులుగా నమోదైంది.

విద్యార్థినులపై వేధింపులు

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 13: చి న్నారులకు విద్యాబోధనలు నేర్పించే ఉపాధ్యాయులే లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన రాజమ హేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ ఏ బ్లాక్ మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. పాఠశాలలో రెండో తరగతి ఉపా ధ్యాయుడు సన్యాసిరావు ఐదో తరగతి విద్యార్థినుల ను శారీరకంగా వేధిస్తున్నాడంటూ తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న విద్యా శాఖ అధికారులు పాఠశాల వద్దకు చేరుకొని తల్లి దండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడు తమ పిల్ల లను శారీరకంగా వేధిస్తున్నాడని విద్యార్థినుల తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలా నికి చేరుకున్న డీఎస్పీ భవ్య విద్యార్థినుల తల్లిదండ్రు లతో పాటు పాఠశాల సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సన్యాసిరావుపై బొమ్మూరు పోలీసులకు తల్లిండ్రులు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎంఈఓ తులసీదాస్ మాట్లడుతూ ఈసంఘటనపై విచారణ అనంతరం నివేదికను జి ల్లా విద్యాశాఖాధికారికి తగు చర్యల కోఐఎసం పంపు తామన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 13: కాకినాడ రూరల్ బీచ్ రోడ్డు చౌదరి గెస్ట్ హౌస్ వెనకాల గల సముద్రతీరంలో 50 ఏళ్లలోపు గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించినట్టు తిమ్మాపురం ఎస్‌ఐ ఎంపీవీ రవీంద్రబాబు తెలిపారు. మృతదేహంపై పచ్చరంగు జాకెట్టు ఎరుపు రంగు లంగా, మెడలో ఎరుపు రంగు తావీదు తాడు, తెలుపు, నలుపు రంగు జుట్టు కలిగి ఉందన్నారు. ఎడమ చేతికి ఆకుపచ్చ రంగు కలిగిన రెండు మట్టి గాజులు, కుడిచేతికి ఆకుపచ్చ, నీలం రంగు రెండు మట్టి గాజులు ఉన్నాయన్నారు. ఆచూకీ కోసం 0884-2306332, 9440796556 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందాలని కోరారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 13: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ను అనుసరించి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించను న్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత శుక్రవారం ఒక ప్రక టనలో తెలిపారు. అమలాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ, పెద్దాపురం, రామచంద్రపురం, పిఠాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సునీత కోరారు.

కోత, కుట్లు లేకుండా కిడ్నీలో రాళ్ల తొలగింపు

మెడికవర్‌లో 11 నెలల బాలుడికి అరుదైన వైద్యం

సామర్లకోట, సెప్టెంబరు 13: ఉభయగోదావరి జిల్లాలోనే తొలిసారిగా 11 నెలల బాలుడికి ఎటువంటి కుట్లు, కోత లేకుండా అత్యాధునిక ఆర్‌ఐఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా కిడ్నీలో రాళ్లను విజయవంతంగా తొలగించామని కాకినాడ జిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులో ఉన్న మెడికోవర్ ఆసుపత్రి వైద్యబృందం శుక్రవారం వెల్లడించింది. కాకినాడ జిల్లాకు చెందిన ఒక బాలుడు కొన్ని నెలలుగా తీవ్ర జ్వరం, కడుపునొప్పితో బాధపడుతూ, మూత్రం పోయడంలో తీవ్ర ఇబ్బంది పడుతుండగా గమనించి తల్లిదండ్రులు పలు ఆసుపత్రులు తిప్పినా ఎటువంటి ఫలితం లేకపోవడంతో తమ మెడికవర్ ఆసుపత్రికి చివరగా వచ్చారని యూరాలజిస్ట్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, డాక్టర్ మణికంఠ తెలిపారు. ఆ బాలుడికి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి కిడ్నీలో రాళ్ల ఉన్నట్లు నిర్ధారించి వెంటనే సర్జరీ చేసి వాటిని తొలగించాలని బాలుడి తల్లిదండ్రులకు చెప్పామన్నారు. అత్యాధునిక ఆర్‌ఐఆర్‌ఎస్(రెట్రో గ్రేడ్ ఇంట్రారెనల్ సర్జరీ) ప్రక్రియ ద్వారా బాలుడి కిడ్నీలో రాళ్లను తొలగించి బాలుడిని మూడు రోజుల్లో పూర్తి ఆరోగ్యంగా ఇంటికి పంపామన్నారు. పోషరాహార లోపం, అధిక ఉప్పు వినియోగం, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం వల్ల భారతదేశంలో కిడ్నీ స్టోన్ వ్యాధి సాధారణమైతే.. నవజాత శిశువులలో దీనిని కనుగొనడం అతి అరుదని చెప్పారు. ఆర్‌ఐఆర్‌ఎస్ అనేది ఎండోస్కోపిక్ శస్త్రచికిత్స అని ఇది మూత్ర నాళం నుంచి కిడ్నీ చేరుకోవడానికి అనుమతిస్తోందన్నారు. ఈ రకమైన విధానాలకు అనువైన యూరిటెరోస్కోప్ ఉపయోగించబడుతుందన్నారు. దీని తర్వాత చిన్న చిన్న రాళ్ల ముక్కలను కూడా పూర్తిగా తొలగించవచ్చన్నారు. ఈ ప్రక్రియలో ఎటువంటి కోతలు, కుట్లు ఉండవన్నారు. రక్తస్రావం కూడా ఉండదన్నారు. అనస్తీషియాలజిస్ట్ డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ ఇది ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ అని 11 నెలల బాలుడు కారణంగా మత్తు ఇవ్వడంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ సుభాకరరావు మాట్లాడుతూ ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం ద్వారా బాలుడికి ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. తమ మెడికోవర్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యచికిత్సలు విజయవంతంగా నిర్వహించేందుకు సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే గాకుండా అనుభవజ్ఞులైన వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారని డాక్టర్ కళ్యాణ్‌బాబు అన్నారు.

యువతిపై అత్యాచారయత్నం.. ఒకరికి ఏడేళ్ల జైలు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 13: పద్దెనిమిదేళ్ల యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ వ్యక్తికి ఏడేళ్ల క ఠిన కారాగార శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అదనపు డిస్ట్రిక్ట్-సెషన్స్ కోర్టు కం స్పెషల్ కోర్టు జడ్జి వై.బె న్నయ్యనాయుడు శుక్రవారం తీర్పు చెప్పారు. అమలాపు రం తాలూకా సీఐ పి.వీరబాబు కథనం ప్రకారం... అమలాపురం రూరల్ మండలం సాకుర్రు గ్రామానికి చెందిన పద్దెనిమిదేళ్ల యువతి ఇంటర్ చదువుకుని తాత య్య వద్ద ఉంటోంది. గత ఏడాది ఫిబ్రవరి 7వ తేదీ మ ధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంట్లో ఆ యువతి వద్దకు నేలపూడి వీర వెంకట సత్యనారాయణ అలియాస్ గుండు వచ్చి ఆమెను కోరిక తీర్చమని వేధించాడు. లేక పోతే యాసిడ్ పోస్తానని హెచ్చరించాడు. ఆమెపై అత్యా చారయత్నానికి ప్రయత్నించాడు. ఆ యువతి కేకలు వే యడంతో ఆమె అమ్మమ్మతో పాటు చుట్టుపక్కలవారు ప రుగున వచ్చారు. యువతి ఫిర్యాదు మేరకు అమలాపు రం తాలూకా పోలీసుస్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ ఎ.పరదేశి కేసు నమోదుచేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. పూర్తి సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖ లు చేశారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారిశెట్టి వెంకటేశ్వరరా వు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వాదో పవాదాల అనంతరం సత్యనారాయణపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.ఐదు వేలు జ రిమానా విధిస్తూ న్యాయమూర్తి బెన్నయ్యనాయుడు తీ ర్పు చెప్పారు. ఈ కేసులో కృషి చేసిన అప్పటి ఎస్‌ఐ అం దే పరదేశి, ఏఎస్‌ఐ ఆర్.గోపాలకృష్ణ, సీఐ పి.వీరబాబు, కోర్టు కానిస్టేబుల్ జి.సురేష్‌లను ఎస్పీ బి.కృష్ణారావు ప్ర త్యేకంగా అభినందించారు.

రోడ్డు ఫెన్సింగ్‌ను ఢీకొన్న బైక్

దంపతులకు తీవ్రగాయాలు.. ఆసుపత్రికి తరలింపు

దేవరపల్లి, సెప్టెంబరు 13: దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పెన్సింగ్‌ను ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లజర్ల మండల చీపురుగూడెం గ్రామానికి చెందిన వసంతాడ మధుబాబు భార్య సంగీత, ఏడాది వయసున్న కుమారుడితో గోపాలపురం అత్తవారి ఇంటి వద్ద నుంచి చీపురుగూడెం స్వగ్రామానికి శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై బయలుదేరారు. దేవరపల్లి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన పెన్సింగ్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైవే సేఫ్టీ అంబులెన్స్‌లో వీరిని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరంప్రైవేటు ఆసుపత్రికి తరలించారు

డిజిటల్ మూల్యాంకన ప్రవేశపెట్టే దిశగా అడుగులు


ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహనరావును నన్నయలో సన్మానిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 13 : డిజిటల్ మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టేదిశగా అడుగులు వేస్తున్నామని, పరీక్ష పత్రాల మూల్యాంకనం మరింత పారదర్శకంగా సాగుతుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయా కళాశాలలకు సంబంధించిన పలు విషయాలను అధికారులతో చర్చించారు. నాణ్యమైన ఉన్నతవిద్యను అందించేందుకు యూపీ లో వివిధ మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దానికి అనుగుణంగా విశ్వ విద్యాలయం పనిచేయాలని కోరారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ ఐడీలను విద్యార్థులందరూ క్రియేట్ చేసుకోవాలని సూచించారు. తద్వారా సర్టిఫికెట్లను డిజిటల్ రూపంలో భద్రప రచుకుని, వాడుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈసందర్భంగా నన్నయ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం రామ్మోహనరావును శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, విశ్వవిద్యాలయ అధికార్లు పాల్గొన్నారు.

'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ధ్రువపత్రం తప్పనిసరి'

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు13: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు సంతాన సాఫల్య కేంద్రాలు మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం(ఎంటీపీ) ధ్రువపత్రాల అనుమతి తప్పనిసరిగా పొంది ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. రూరల్ మండలం బొమ్మూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎంటీపీ యాక్ట్ పై శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు, సంతానసాఫల్య కేంద్రాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంటీపీ అనుమతులు పొందిన సంతాన సాఫల్యకేంద్రాలు నిర్వహిస్తున్న ఆసుపత్రులు విధిగా ప్రతినెలా నిర్దేశించిన ఫార్మేట్‌లో నివేదికలను అందజేయాలన సూచించారు. ఎంటీపీ అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించామని, వాటికి సంబంధించి ఆయా ఆసుపత్రులలో సీనియర్ డివిజనల్ అధికారి ద్వారా స్థల పరిశీలన జరిపించి అనుమతులు మంజూరు తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. ఆ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ సంధ్య, కమిటీ సభ్యులు గైనకాలజిస్టులు డాక్టర్ టి.పద్మజ, సీహెచ్ శైలజ, ఎన్జీవో జి.మానస, పంచాయతీరాజ్ సిబ్బంది పి.శశాంక తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాలువలో వ్యక్తి మృతదేహం

తుని రూరల్, సెప్టెంబరు 13: కాకినాడ జిల్లా తుని మండలం లోవ కొత్తూరుశివారు పోలవరం కాలువలో వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. గట్టుమీద చెప్పులు, కాలువలో మృత దేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు రౌతులపూడి మండలం రౌతులపూడి గ్రామానికి చెందిన జిగిరెడ్డి శ్రీనివాసరావు(42)గా తెలిపారు. సంబంధిత వ్యక్తి సివిల్ కేసు విషయమై తుని వచ్చి, పని ముగించుకుని, రౌతులపూడి ఇంటికి వెళ్లే క్రమంలో పోలవరం కాలువలో మృతదేహంగా కనిపించడంపై మృతుడి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపడుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

'క్రీడలతో మానసికోల్లాసం'


బ్యాడ్మింటన్ ఆడుతూ విద్యార్థులను ఉత్సాహ పరుస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, సెప్టెంబరు 13: క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసంతో పాటుగా ప్రత్యేకగుర్తింపు లభిస్తాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. శుక్రవారం అన్నవరం జూనియర్ కళాశాల మైదానంలో అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాల అండర్-19 బాలబాలికలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బ్యాట్ చేతబట్టి కొద్దిసేపు బాల్‌బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచి తన చిన్ననాటి స్కూల్ గుర్తులను నెమరువేసుకున్నారు. అసోసియేషన్ చైర్మన్ ముప్పన వీర్రాజు మాట్లాడుతూ 13, 14, 15 తేదీలలో ఈపోటీలు నిర్వహించి వీరిలో ప్రతిభ కలిగిన వారిని రాష్ట్ర స్థాయి టీంగా ఎంపిక చేస్తామని, వీరు సెప్టెంబరు 29 నుంచి 31 వరకు హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆడతారన్నారు. తొలిరోజు పోటీలలో విశాఖ, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల టీంలు బాలుర విభాగంలో విజయం సాధించగా, బాలికల విభాగంలో తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విశాఖ, గుంటూరు, ప్రకాశం జట్లు విజయం సాధించాయి. కార్యక్రమంలో టీడీపీ నేత యనమల రాజేష్ పాల్గొన్నారు. వీరభద్రస్వామి, సీతాపతిరావు, పాల్గొనగా పర్వత వీరేష్, కోళ్ల సూరిబాబు తదితరులు అంపైర్లుగా వ్యవహరించారు.

సడన్.. సర్ప రైజ్..

మోతుగూడెం జెన్కో కాలనీలో కింగ్ కోబ్రా హల్‌చల్



మోతుగూడెం, సెప్టెంబరు13: మోతుగూడెం సెకండ్ రింగ్ రోడ్‌లో శుక్రవారం కింగ్ కోబ్రా హల్‌చల్ చేసింది. పదిరోజులుగా కురిసిన వర్షాలకు, వరదలకు ఎటునుంచి వచ్చిందో తెలియదు కానీ రెండో రింగ్ రోడ్డులో సుమారు 10 అడుగులున్న కింగ్ కోబ్రా కనిపించడంతో ఈ ప్రాంత వాసులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఈ మధ్యకాలంలో కింగ్ కోబ్రా హల్‌చల్ చేయడం రెండోసారి. దీంతో చిన్న పిల్లలను భయటకు వదలాలంటేనే తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి కింగ్ కోబ్రాను పట్టుకుని దూరంగా అడవిలో వదిలేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిచో పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలుపుతున్నారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, సెప్టెంబరు 13: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు.

విద్యార్థులు ధైర్యంగా ప్రతిసవాళ్లను ఎదుర్కోవాలి

జేఎన్టీయూకే వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 13: విద్యార్థులు ధైర్యంగా ప్రతిసవాళ్లను ఎదుర్కోవాలని జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ.మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో ఐఐఎఫ్‌టీ కాకినాడ ఐపీఎం 2024-29 బ్యాచ్ కోసం నిర్వహించిన ఓరియంటేషన్ వారం ముగింపు వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది. అతిథులు జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్‌ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) కాకినాడ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ వి.రవీంద్ర సారధి విద్యార్థులకు ఉండాల్సిన నాయకత్వ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విద్యార్థులు నేటి వేగవంతమైన ప్రపంచంలో అప్‌డేట్‌గా ఉండాలన్నారు. ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్ కుమార్ మాట్లాడుతూ ఐఐఎఫ్‌టీని ఆధునికకాలపు గురుకులంగా పేర్కొన్నారు. ఆరోరా లైఫ్‌సైన్సెస్ సీఈవో రాజేంద్రరావు మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌లద్వారా విద్యార్థులు సిద్ధాంత జ్ఞానాన్ని ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ఐఐఎఫ్‌టీ ఉపకులపతి ప్రొఫెసర్ రాకేష్ మోహన్ జోషి మాట్లాడుతూ ఐఐఎఫ్‌టీ విద్యార్థుల విభిన్న నేపథ్యాలను, భావాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఓఎస్డీ బాబూరావు నాయుడు, డాక్టర్ రష్మీరస్తోగి, పీఎం చార్యులు, ఐఐఎఫ్‌టీ అధ్యాపకులు, ఐపీఎం విద్యార్థులు ఉన్నారు.

'కొత్త ఆవిష్కరణలతో నాణ్యమైన వైద్య సేవలు'

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 13: వైద్య రంగంలో కొత్త ఆవిష్కరణలు, పరిశోధనల ద్వారా మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని, సదస్సుల ద్వారా మేధావుల అనుభవాలను పంచుకోవడం ద్వారా మరింత వైద్య విజ్ఞానాన్ని ఔత్సాహిక వైద్యులకు అందించవచ్చని పలువురు సీనియర్ వైద్యులు తెలిపారు. శుక్రవారం కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో 47వ రాష్ట్ర అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా చాప్టర్ (ఏపీఏఎస్ఐసీఓఎన్) సమావేశం ఛైర్మన్ డాక్టర్ కె.శివశంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 3రోజులపాటు జరిగే సర్జన్ల కాన్ఫరెన్స్‌లో కొత్తగా వైద్య రంగంలోకి వస్తున్న మార్పులు, ఆచరణలు, అనుభవాలను అనుభవం కలిగిన నిపుణులైన వైద్యులు, కొత్త డాక్టర్లతో చర్చించే మంచి అవకాశం లభిస్తుందన్నారు. చాప్టర్ రాష్ట్ర కార్యదర్శి పి.ఫణికుమార్‌రెడ్డి, డాక్టర్ సూరపనేని సుష్మ, రిటైర్డు జీజీహెచ్ పర్యవేక్షకుడు ఏఎస్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

'విచారణ పారదర్శకంగా చేపట్టాలి'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 13: జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి సంతకాల ఫోర్జరీతో అక్రమంగా వంద రోజుల మస్తర్లు నమోదు చేసి కోట్లాది రూపాయలు ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ గుత్తుల గోపీపై పారదర్శకంగా విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం నేమాం శివారు గుత్తులవారి పాలెంలో కమ్యూనిటీ హాలు వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి,అక్రమాలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. గుబ్బల శివ, జి.వరలక్ష్మి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై తగిన ఆధారాలతో డ్వామా పీడీకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈనెల 11న విచారణకు వచ్చిన అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై తగిన చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టడం చేపడతామని... విషయాన్ని సీఎం, డిప్యూటీ సీఎం వద్దకు తీసుకెళ్తామన్నారు.

'ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వహించాలి'

తాళ్లరేవు, సెప్టెంబరు 13: జంటగ్రామాల గ్రామదేవతల మహాలక్ష్మమ్మతల్లి జాతర ఉత్సవాలను గ్రామస్తులంతా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ అన్నారు. శుక్రవారం కోరింగ పంచాయతీ పెద చిన బొడ్డు వెంకటాయపాలెం గ్రామస్తులు, పెద్దలతో సీఐ చర్చించారు. గ్రామస్తులంతా సమన్వయంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా గ్రామస్తులతో కమిటీలను ఏర్పాటు చేసి ఉత్సవాల్లో ఏ అల్లర్లు జరగకుండా చూసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ, టీడీపీ నేతలు వాడ్రేవు వీరబాబు, వైదాడి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఉన్నారు.

కనకదుర్గ హుండీ ఆదాయం రూ.1.48 లక్షలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 13: స్థానిక సంతచెరువు శ్రీ కనకదుర్గ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.1,48,030 లక్షల ఆదాయం లభించినట్టు ధర్మదాయ-దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ తెలిపారు. సంతచెరువు సినిమా రోడ్డులో గల అమ్మవారి ఆలయంలో ఆలయ ఈవో జోగా సత్యనారాయణ, కైకవోలు ఈవో డి.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో హుండీలను తెరచి లెక్కింపు నిర్వహించారు. ఈ ఆదాయం భక్తులు అమ్మవారికి వివిధ కానుకల రూపంలో 5 నెలల 12 రోజులకు హుండీలో సమర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలులూరు ఈవో కె వేణుగోపాల్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

'వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు'

ఏలేశ్వరం, సెప్టెంబరు 13: వ్యవసాయరంగంలో రైతులకు అందుబాటులో ఉండేలా విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని వ్యవసాయ అధికారిణి బి.జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని సిరిపురంలో రైతులకు పొలంబడి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏవో జ్యోతి రైతులకు డ్రోన్ ద్వారా పొలాలకు పురుగుల మందులు, నానో యూరియా, ద్రవ రూప ఎరువులు సులంభంగా పిచికారీ చేసే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధనేకుల వీరభద్రరావు, చిలకమర్తి ఆదినారాయణ, అత్తి సాంబశివ, అల్లం బ్రహ్మం, సందన ప్రభాజీ, వ్యవసాయ సిబ్బంది తదితరులున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వాహనదారులకు జైలుశిక్ష

కాకినాడ క్రైం, సెప్టెంబరు 13: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి 4 రోజులు, ఇద్దరికి రెండేసి రోజుల చొప్పున జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్ 1, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. 8 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్టు నిర్ధారించారు. వారికి ట్రాఫిక్ పోలీసులు కాకినాడ మూడో స్పెషల్ జ్యుడిషీయల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా న్యాయమూర్తి వి.నరసింహారావు ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇందులో ఒకరికి 4, ఇద్దరికి రెండేసి రోజుల జైలు శిక్ష విధించారు. మిగతా ఐదుగురికి తలో రూ.10వేలు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐలు రమేష్, రామారావులు తెలిపారు.

కిర్లంపూడి: కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో గత పది రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ ఐదుగురిని శుక్రవారం ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచారు. ముగ్గురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా, ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించడం జరిగిందని ఎస్ఐ జి.సతీష్ తెలిపారు.

'పీఆర్'లో హిందీ భాషా దినోత్సవం

కాకినాడ రూరల్, సెప్టెంబరు 13: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం మాట్లాడుతూ హిందీ భాషావారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు హిందీలో వ్యాసరచన, వక్తృత్వం, పాటల పోటీలు నిర్వహించామన్నారు. ముఖ్యఅతిథి కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ హిందీలో అనేక ఉపాధి అవకాశాలున్నాయన్నారు. కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.హరిరాంప్రసాద్, ముఖ్యఅతిథులు కేవీ సత్యనారాయణ, డాక్టర్ వేదుల శిరీష్, వైస్ ప్రిన్సిపాల్ కె.ఆంజనేయలును సత్కరించారు. అనంతరం పోటీలలోని విజేతలకు అతిథులు చేతులమీదుగా ప్రతిభాపత్రాలను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉషా, బేగం, బుజ్జి పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

సామర్లకోట, సెప్టెంబరు 13: మండలంలో వరద 120మంది బాధితులకు సరిపడా హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కార్యకర్తలు, గ్రామ యువత ఐక్యంగా నిత్యావసరాల కిట్లను రూపొందించి శుక్రవారం సామర్లకోట టిడ్కో గృహాల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, పుప్పాల వెంకటరమణ, మల్లిపూడి వీర్రాజు, సైతన రాంబాబు, చల్లా దుర్గాప్రసాద్ ఈ సామగ్రిని సేకరించారు. ఒక్కొక్క కిట్‌లో 16 కిలోల బియ్యం, కిలో బ్రాన్ ఆయిల్, అరకిలో కందిపప్పులను ఏర్పాటుచేసి అందజేశారు. కార్యక్రమంలో పుప్పాల శ్రీను, పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వార్డు మెంబర్ వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 13: ప్రత్తిపాడు మండలంలో చింతలూరు గ్రామ వైసీపీ వార్డు మెంబర్ మాతా అర్జున్‌కుమార్ వేధిస్తున్నాడంటూ ఆ గ్రామ కార్యదర్శి ఎల్.గంగాధర్, సచివాలయ సిబ్బంది శుక్రవారం సాయంత్రం ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబుకు ఫిర్యాదు చేశారు. అలాగే మాతా అర్జున్‌కుమార్ వేధింపులపై కలెక్టర్, ఎస్పీ, డివిజనల్ అధికారులకు కూడా కార్యదర్శి ఫిర్యాదులు పంపారు. దీనిపై విచారణ నిర్వహిస్తామని ఎంపీడీవో కుమార్ బాబు ఫిర్యాదుదారులకు తెలిపారు.

సచివాలయ సిబ్బందితో సమీక్ష

జగ్గంపేట, సెప్టెంబరు 13: స్థానిక రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ జగ్గంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని 4 సచివాలయాల సిబ్బంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ 18వార్డులకు సంబంధించి పారిశుధ్య సిబ్బంది, వాటర్ సప్లయర్స్, వాహనాల డ్రైవర్ల విద్యుత్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామంలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, విద్యుత్ సమస్యలపై చర్చించి జగ్గంపేట గ్రామ ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి ప్రతి ఒక్కరు పని చేయాలని సూచించారు. ఎస్‌పీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు,దేవరపల్లి మూర్తి ఉన్నారు.

నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



పెద్దాపురం: నీట మునిగిన పంట పొలాలను ట్రాక్టర్‌పై పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, సెప్టెంబరు 13: ఏలేరు వరదల కారణంగా నష్టపోయిన ప్రతీ రైతుకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినారాజప్ప అన్నారు. మండలంలోని కట్టమూరులో ఏలేరు వరద ఉధృతి కారణంగా నీటమునిగిన పంట పొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులతో మాట్లాడి ఎంతమేర నష్టంవాటిల్లిందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు పరిహారం అందచేయడం జరుగుతుందని, అందుకోసం రైతులు రైతుసేవా కేంద్రంలో ఆధార్, పొలానికి సంబంధించిన పాస్‌బుక్ బ్యాంక్ అకౌంట్ తదితర జిరాక్స్ కాపీలను తీసుకువెళ్లి తమ పేర్లు నమోదుచేసుకోవాలని కోరారు. పలువురు రైతులు ఏలేరు వరదల కారణంగా జగ్గన్న కాలువకు గండి పడిందని, కాండ్రకోట నుంచి వచ్చే నీరు ఈ గండి కారణంగా తక్కువగా వస్తోందని, ఈనీటి కారణంగా కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలు పంట సాగవుతుందని, కాలువను పునరుద్ధరించాలని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో కొమ్మోజు సంజయ్‌కుమార్, హెచ్‌వో నూనే సుజాత, కూటమి నేతలు రాజాసూరిబాబురాజు, ఎలిశెట్టి నాని, మేడిది శ్రీనివాస్, సానిపిన రామకృష్ణ, యేలేటి సత్తిబాబు, సుబ్బారావు, అడపా గంగాధర్, మాదిరెడ్డి రామకృష్ణ, అడపా శివదుర్గ తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడి: వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో

నిత్యావసరాల పంపిణీ

కిర్లంపూడి, సెప్టెంబరు 13: ఏలేరు వరదతో అతలాకుతలమైన కిర్లంపూడి మండలంలోని భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం గ్రామాల్లో బాధితులకు శుక్రవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఆర్డీవో సీతారామరావు నిత్యావసర సరుకుల కిట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బారిన పడిన ఇళ్లకు రూ.10వేలు, పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.25వేలు అందించేందుకు సీఎం చంద్రబాబు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట గాంధీ, వీరంరెడ్డి కాశీబాబు, చదరం చంటిబాబు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అల్లు విజయకుమార్, కంచుమర్తి రాఘవ, కానూరి కాసులు, త్రాసు, సర్పంచ్ పట్టు చంటిబాబు, కాశి ఉన్నారు.

హౌసింగ్ పీడీ పర్యటన

కిర్లంపూడి మండలంలోని ఏలేరు వరద ముంపునకు గురైన రాజుపాలెం, శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం, భూపాలపట్నం గ్రామాల్లో జిల్లా హౌసింగ్ పీడీ సత్యనారాయణ, పెద్దాపురం ఆర్డీవో సీతారామరావు పర్యటించారు. రాజుపాలెంలో సీఎం చంద్రబాబు ఇటీవల పర్యటించి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి దీనిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించడంతో వారు రాజుపాలెం వచ్చారు. దెబ్బతిన్న ఇళ్లు, పంటలు పూర్తిస్థాయిలో పరిశీలించి నష్టంపై నివేదిక ఇస్తామన్నారు. హౌసింగ్ ఈఈ గుప్తా, డీఈ వి.శ్రీనివాస్, తహసీల్దార్ చిరంజీవి, సూపరిండెంట్ సతీష్, హౌసింగ్ ఏఈ భవానీ, రాజుపాలెం గ్రామ టీడీపీ నాయకుడు గండం ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గోడే దొరబాబు, భూపాలపట్నం సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు పాల్గొన్నారు.

'నష్టాన్ని అంచనా వేయాలి'

గొల్లప్రోలు, సెప్టెంబరు 13: అధిక వర్షాలు, వరదలకు చేనేత మగ్గాల గోతుల్లోకి నీరు చేరడంతో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని చేనేత శాఖ ఏడీ పెద్దిరాజు ఆదేశించారు. ఆయన గొల్లప్రోలు మార్కండేయపురంలో గోతుల్లోకి నీరు చేరిన చేనేత మగ్గాలను శుక్రవారం పరిశీలించారు. వారికి ప్రభుత్వ పరంగా సహకారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. చేనేత అభివృద్ధి అధికారి రవికుమార్, చేనేత సొసైటీ కార్యదర్శి వీరబాబు తదితరులు ఉన్నారు.



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అతిథులు

'ఆదిత్య'లో టెక్ ఫెస్ట్ ప్రారంభం

గండేపల్లి, సెప్టెంబర్ 13: గండేపల్లి మండలం సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీలో వేద 2కె24 జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. జ్యోతి ప్రజ్వలన అనంతరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి క్రిఫీ ఎండీ అండ్ సీఈవో కొవ్వూరి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా రాగా యూనివర్శిటీ ప్రో వైస్‌చాన్సలర్(అకడమిక్) డాక్టర్ ఎస్.రమాశ్రీ , రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ అదిరెడ్డి, డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ వేద 2కె24 కోఆర్డినేటర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు. డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా ఈ టెక్‌ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం 7500 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ రాజమండ్రి సైంటిఫిక్ అసిస్టెంట్ అంబేద్కర్, డీన్ ఎవి మాధవరావు తదితరులు ఉన్నారు.

ప్రతీ ఇంటికి రక్షిత తాగునీరు : ఎమ్మెల్యే దివ్య

తొండంగి, సెప్టెంబరు 13: నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి రక్షిత తాగునీరందించడమే తన లక్ష్యమని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. శుక్రవారం ఆమె గోపాలపట్నంలో నూతనంగా నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో అవసరమైనమేర ట్యాంకులు నిర్మించి నీరందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, కొయ్యా రామకేశవ, మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతనీడి అబ్బాయి, టీడీపీ జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోడ వెంకటరమణ, జనసేన నేత బెండపూడి నాయుడు, టీడీపీ మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, యడ్ల సూరిబాబు ఉన్నారు.



తొండంగి: రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మాస ఉత్సవాల్లో భాగంగా డి.పోలవరంలో పతాంజలి ప్రతినిధులు నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎల్.మల్లికార్జునరావు, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, పతాంజలి ఏజీఎం పట్టాభిరామిరెడ్డి, రవీంద్ర, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, పలక సోమేశ్వరరావు, పీడీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి : జేసీ



నిమజ్జన ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న జేసీ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 13: వినాయక చవితి నవరాత్రుల ముగింపు వేడుకల్లో భాగంగా ఈనెల 16న బీచ్‌లో జరిగే నిమజ్జన కార్యక్రమానికి ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. శుక్రవారం కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనం జరిగే ప్రదేశాన్ని తనిఖీ చేశారు. గణేష్ నిమజ్జనం చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయని, నిమజ్జనం జరిగే ప్రదేశంలో ముందస్తు చర్యల్లో భాగంగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. భారీ విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్‌లు, విద్యుత్తు సిద్ధం చేయాలన్నారు. విగ్రహాల తరలింపులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ వెంట కాకినాడ రూరల్ తహశీల్దార్ ఎంవీవీ సత్యనారాయణ, వీఆర్వోలు ఉన్నారు.

బురద రాజకీయాలకు జగన్‌రెడ్డి పెట్టింది పేరు

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 13: బురద రాజకీయాలకు మాజీ సీఎం జగన్‌రెడ్డి పెట్టింది పేరని, రాష్ట్రంలో వరద బాధితులకు సహాయం చేయాల్సిందిపోయి రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నాడని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి పిఠాపురంలో వరద బాధితులను పరామర్శించడానికి రాలేదని, బురద రాజకీయాలు చేయడానికి వచ్చాడన్నారు. గత 12 రోజులుగా వరద బాధితులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలబడిందని, జైల్లో ఉన్న క్రిమినల్స్‌ను పరామర్శించడానికి ఉన్న సమయం వరద బాధితులను పరామర్శించడానికి లేదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు జగన్‌రెడ్డికి లేద ని, వైసీపీ ప్రభుత్వ హయంలో వరదలు వచ్చినప్పుడు తాడేపల్లి కొంపను వదిలి బయటకు రాలేదన్నారు. ప్రకృతి వనరులను దోచుకోవడమే పనిగా పెట్టుకుని రాష్ట్ర అభివృద్ధిని, జల వనరుల శాఖను నిర్లక్ష్యం చేయడం వల్లే నేడు వరద ప్రభావం ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై పడిందని ఎమ్మెల్యే కొండబాబు విమర్శించారు.

వరద బాధితులకు సాయం

వరద బాధితుల సహాయార్థం జె కామ్ ఎల్ కాకినాడ 1.0 గ్రూపు రూ.66వేల చెక్కును కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు ఆయన స్వగృహం వద్ద అందజేశారు. గ్రూపు సభ్యులు పి.శ్రీనివాస్, విహారి, సతీష్, కపిల్, ఆదిత్య, హర్షిత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

నిత్యావసరాల కిట్ల పరిశీలన

సామర్లకోట, సెప్టెంబరు 13: జిల్లాలో భారీ వర్షాలు, ఏలేరు వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో బాధిత ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేందుకు సామర్లకోట ఏపీఎస్‌డబ్ల్యూసీ గోదాములలో సిద్ధం చేస్తున్న కిట్లను జేసీ రాహుల్ మీనా శుక్రవారం పరిశీలించారు. సరుకుల నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఒక్కొక్క కిట్‌లోనూ 25 కిలోల బియ్యం, కిలో పంచదార, కిలో కందిపప్పు, కిలో బంగాళాదుంపలు, కిలో ఉల్లిపాయలు చొప్పున ముంపు బాధిత ప్రాంతాలైన పిఠాపురం, గొల్లప్రోలు, యూ.కొత్తపల్లి, తొండంగి, ఏలేశ్వరం మండలాల ప్రజలకు అందించేలా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్వో ఎంవీప్రసాద్, సివిల్ సప్లయ్ డిఎం ఎం.బాల సరస్వతి, టెక్నికల్ అసిస్టెంట్ విజయరాజ్, సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఉన్నారు.

ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

ఏచూరి చిత్రపటానికి నివాళి

పెద్దాపురం, సెప్టెంబరు 13: సీపీఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ప్రజాఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషబాబ్జీ అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో సీపీఎం పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి శేషబాబ్జీతోపాటు కరణం ప్రసాదరావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, డి.సత్యనారాయణ, బాలం శ్రీనివాస్, కరణం గోవిందు, డి.కృష్ణ, గడిగట్ల సత్తిబాబు, దాడి బేబీ, నాగమణి, పద్మ, వరలక్ష్మీ సావిత్రి, మరిడియ్య తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు: కామ్రేడ్ ఏచూరి సీతారాం మృతి సీపీఎం పార్టీకి తీరని లోటని ఆపార్టీ ప్రత్తిపాడు మండల శాఖ పేర్కొంది. స్థానిక సంత మార్కెట్ సెంటర్‌లో ఏచూరి చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, మండల కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ.శివదుర్గ, ఎ.సతీష్‌కుమార్, బి.సత్యానందం, ఎన్.శ్రీను, కె.శ్రీను, బాబి, రమణ పాల్గొన్నారు.

వరద నీటిలో మృతదేహం తరలింపు



గొల్లప్రోలు,సెప్టెంబరు 13: తగ్గని వరద ముంపు అంతిమసంస్కారాల నిర్వహణకు అడ్డంకిగా మారుతున్నది. గొల్లప్రోలులోని జగనన్న కాలనీకి చెందిన ముసరపు సుబ్బారావు(80) గురువారం రాత్రి మరణించాడు. కాలనీకి వచ్చే రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తహశీల్దారు సత్యనారాయణ సూచనల మేరకు వీఆర్వో పరమేశ్వరరాజు శుక్రవారం అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బోటుపై తరలించారు. అక్కడ నుంచి వరద నీటిలోనే శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

వాడివేడిగా గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశం

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 13: సమస్యలపై సభ్యులు ఏకరవు పెట్టడంతో గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశం వాడివేడిగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు మాట్లాడుతూ గతంలో పంటనష్టాలు సక్రమంగా నమోదు చేయక రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈసారి అటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నష్టాల నమోదు సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు ఎందుకివ్వడం లేదని పలువురు ప్రశ్నించారు. మల్లవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు తక్షణం మరమ్మతులు నిర్వహించాలని ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో వైస్ఎంపీపీలు బత్తిన మంగ, నేమాని ఆదివిష్ణు, ఎంపీడీవో డీఎల్ఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'రైతులను ఆదుకునేందుకు చొరవ చూపాలి'

తుని రూరల్, సెప్టెంబరు 13: భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులకు అన్నివిధాలా ఆదుకునేందుకు అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ బొప్పన రాము కోరారు. ఎంపీపీ అధ్యక్షతన తునిలో జరిగిన మండల పరిషత్ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పంట నష్టం లెక్కింపును పక్కాగా చేపట్టాలని, అస్తవ్యస్థంగా మారిన ఇరిగేషన్ పనులను చక్కదిద్ది రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలో ఎస్.అన్నవరం, కుమ్మరిలోవ, తాళ్ళూరు, రేఖవానిపాలెనికి 14 ఫైనాన్స్ నిధులు మంజూరు కాకపోవడంతో ఆయా గ్రామాల్లో కనీస పారిశుధ్య పనులు కూడా చేపట్టేందుకు నిధులు లేవని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ఆయా పంచాయతీలకు నిధులు నిధులుమంజూరు చేయాలని కోరారు. ఎంపీడీవో రవికుమార్, అధికారులు ఉన్నారు.

కాకినాడ క్లీన్ అండ్ గ్రీన్‌గా మారాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 13: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వతేదీ వరకు చేపట్టే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కాకినాడ నగరం క్లీన్ అండ్ గ్రీన్‌గా మారాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. అదనపు కమిషనర్ సుధాకర్, ఎస్ఈ సత్యకుమారి, ఈఈ మాధవి, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృధ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ తదితర విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల నిర్వాహణకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. స్వచ్ఛతాకీ భాగీదారి, సంపూర్ణ స్వచ్ఛతా, సఫాయి మిత్ర సురక్ష వంటి కీలక అంశాల ఆధారంగా నిర్వహించాలని తెలిపారు. సుమారు 15 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ పూజలు



తాళ్లరేవులో గణపతి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

తాళ్లరేవు, సెప్టెంబరు 13: గణపతి నవరాత్రుల్లో భాగంగా పలుచోట్ల ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్ మాధుర్ శుక్రవారం సుంకరపాలెం, జార్జీపేట, తాళ్లరేవు, గుడివానితూము సెంటర్లల్లో వినాయకుడుకి ప్రత్యేక పూజలు చేశారు. జార్జీపేట, గాంధీనగర్, గుడ్డువానితూము సెంటరుల్ వినాయక నిమజ్జానం సందర్భంగా ఆలయకమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

'హిందూ ఐక్యతను చాటాలి'

సామర్లకోట, సెప్టెంబరు 13: సామూహిక గణపతి విగ్రహాల నిమజ్జనం ద్వారా హిందూ ఐక్యతను చాటాలని పెద్దాపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ తుమ్మల పద్మజ పిలుపునిచ్చారు. సామర్లకోటలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక లారీ యూనియన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌తో కలసి శుక్రవారం ఉత్సవ కమిటీ నాయకులు పలు గణపతి ఉత్సవ కమిటీల పందిళ్లను సందర్శించారు. జిల్లా కన్వీనర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య, జగన్నాధం, ఏడుకొండలు, కూనంశెట్టి అర్జునరావు, అల్లు ప్రసాద్, వీరబాబు పాల్గొన్నారు.

వరద బాధిత పాడి రైతులకు సాయం

జగ్గంపేట, సెప్టెంబరు 13: వరద కారణంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో నష్టపోయిన పాడి రైతులకు జగ్గంపేట నియోజకవర్గం తాళ్లూరుకి చెందిన మలిరెడ్డి రామన్నదొర రూ.20 వేల ఆర్థిక సహాయం చేశారు. పాడిరైతులు, కోళ్లఫారం రైతులు రూ.20వేలు అందజేశారు. ధర్మవరానికి చెందిన రైతు నుంచి రూ.1.50లక్షల గడ్డిని సేకరించారని పశుసంవర్ధక శాఖ వైద్యుడు డాక్టర్ సుంకవల్లి సత్యనారాయణ తెలిపారు.

నర్సింగ్ ఉద్యోగుల ఆందోళన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 13: ప్రత్తిపాడు ఆసుపత్రి వద్ద శుక్రవారం కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న 11500 మంది స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని వినతి పత్రాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్యకు అందజేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గండేపల్లి, సెప్టెంబరు 13: గండేపల్లిలో సుంకవిల్లి రమేష్ ఇంటి వద్ద రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం వారిచే శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ వైద్యాధికారిణి సత్య ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో గోపి, బొల్లంరెడ్డి రామకృష్ణ, పైల వెంకన్న ఉన్నారు.

కొత్తలంకలో వరద తగ్గుముఖం

తాళ్లరేవు, సెప్టెంబరు 13: పిల్లంక పంచాయతీ కొత్తలంకలో వరద తగ్గుముఖం పట్టింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల ముందు వరదనీరు మాత్రం కొద్దిగా ఉంది. హెల్త్ సూపర్‌వైజర్ బొడ్డు కుమార్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది మెడికల్ క్యాంపు కొనసాగుతోంది. పంచాయతీ సెక్రటరీ వల్లీబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కట్టా శ్రీను గ్రామంలో పర్యటించారు.

గణపతికి పెన్నులతో అలంకారం

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 13: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా ముఖద్వారం వద్ద ఉన్న యువగణపతిని శుక్రవారం పెన్నులతో అలంకరించారు. పిల్లలకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. వేదపండితుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజలు నిర్వహించగా, నిర్వాహకులు దాసం వాసు, గొల్లపల్లి సత్తిబాబు, అడపా గోవిందు తదితరులు ఉన్నారు.

